ఆఫీస్ స్పేస్‌లో హవా

దేశీయ డిమాండ్‌లో హైదరాబాద్ వాటా 46 శాతం

జూలై-సెప్టెంబర్‌కుగాను నైట్ ఫ్రాంక్ నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో నూతన కార్యాలయ భవనాలను, నిర్మాణాలను అధికంగా పూర్తి చేసిన నగరంగా హైదరాబాద్ నిలిచిందని నైట్ ఫ్రాంక్ ఇండియా తమ తాజా నివేదికలో వెల్లడించింది. బుధవారం నైట్ ఫ్రాంక్ సంస్థ 'ఇండియా రియల్ ఎస్టేట్ క్యూ3 -2023' పేరుతో ప్రత్యేకంగా ఓ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ3)లో నగరంలో 5.3 మిలియన్ల ఆఫీస్ స్పేస్ నిర్మాణం పూర్తయినట్టు తేలింది. ఈ క్రమంలోనే దేశంలో గల 8 ప్రముఖ నగరాల్లోని డెలివరీ ఆఫీస్ స్పేస్‌లో 46 శాతం వాటా హైదరాబాద్‌దేనని పేర్కొన్నది. అదేవిధంగా నగరంలో సగటు అద్దె నెలకు చదరపు అడుగుకి రూ.65.3గా ఉన్నదని, గతంతో పోల్చితే 11 శాతం వృద్ధి ఉందని తెలిపింది. ఇక ఈ త్రైమాసికంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జీసీసీ)లు జరిపిన లావాదేవీలు 75 శాతంగా ఉన్నాయని, ఇందులో హైదరాబాద్‌లోనే 31 శాతం జరిగాయని నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. ఫ్లెక్స్ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లోనూ 13 శాతం హైదరాబాద్‌లోనే జరిగాయి.

ఇండ్ల అమ్మకాల్లో..

ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్‌లో 8,325 యూనిట్లు అమ్ముడైనట్టు నైట్ ఫ్రాంక్ ఇండియా తమ నివేదికలో స్పష్టం చేసింది. నిరుడు ఇదే వ్యవధిలో 7,900 ఇండ్ల విక్రయాలు జరిగాయని, దీంతో ఈసారి 5 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతాల్లో క్యూ3 హౌజింగ్ సేల్స్‌పై నైట్ ఫ్రాంక్ తాజా వివరాలను అందించింది. మొత్తం ఈ 8 నగరాల్లో 12 శాతం పెరిగి 82,612 ఇండ్ల అమ్మకాలు జరిగినట్టు నైట్ ఫ్రాంక్ వివరించింది. దీన్ని ఆరేండ్ల గరిష్ఠ స్థాయిగా పేర్కొన్నది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 73,691 యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఉజాగర్ సర్టిఫికెట్లు పొందిన మైనార్టీ మహిళలతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

మైనార్టీ మహిళలకు ఉజాగర్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర సర్కార్ బాసటగా నిలుస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్థిక, డిజిటల్ ఇన్‌క్ల్యూజివ్ పేరిట ప్రాజెక్టు ఉజాగర్ ప్రోగ్రాం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ పొందిన మైనార్టీ మహిళలకు మంత్రి బుధవారం సర్టిఫికేట్లను అందచేశారు. వీ హబ్, మైనార్టీ సంక్షేమ శాఖ, సఫా సొసైటీ భాగస్వామ్యంతో ప్రాజెక్టు ఉజాగర్ ద్వారా వీరికి వ్యాపార మెళకువలు, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్న ఆయన..వ్యాపార రంగంలో నిలదొక్కుకునేందుకు సీడ్ ఫండింగ్ కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్తలుగా ఎదిగేలా తెలంగాణ సర్కారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్టు చెప్పారు. ఈ కోర్సును పూర్తి చేసిన 49 మంది మహిళలకు మంత్రి కేటీఆర్ ధృవీకరణ పత్రాలు అందచేశారు. కాగా, వీరిలోని 8 మంది మహిళల్లో ఐదుగురికి లక్ష రూపాయల మైనార్టీ శాఖ ద్వారా ప్రోత్సాహక చెక్కులను అందచేశారు. రాష్ట్రంలో మైనార్టీ మహిళల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉజాగర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వీ హబ్ సీఈవో దీప్తి రావుల పేర్కొన్నారు.

మన వాకిట్లోకే బ్యాంక్

ఇక ఇంటి వద్దే నగదు విత్‌డ్రా • మరో నాలుగు బ్యాంకింగ్ సేవలు కూడా

'మొబైల్ హ్యాండ్‌హెల్డ్ డివైజ్' సర్వీస్‌ను తెచ్చిన ఎస్బీఐ

ముంబై, అక్టోబర్ 4: ఎస్బీఐ ఖాతాదారులకు గొప్ప ఊరట లభించింది. నగదు ఉపసంహరణతోసహా మరో 4 రకాల కీలక సేవలను కస్టమర్లు ఇక తమ ఇండ్ల వద్దే పొందే వెసులుబాటు దొరికింది. బ్యాంకింగ్ రంగాన్ని పెరుగుతున్న డిజిటలైజేషన్ కొత్త పుంతలు తొక్కిస్తున్నది మరి. నూతన సాంకేతిక పరిజ్ఞానం బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేస్తున్నది. బుధవారం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ).. 'మొబైల్ హ్యాండ్‌హెల్డ్ డివైజ్' సర్వీస్‌ను ప్రారంభించింది. ఈ డివైజ్‌ను బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా ఆవిష్కరించగా, ఇది ఐదు ప్రధాన బ్యాంకింగ్ సేవలను కస్టమర్లకు అందిస్తుంది. నగదు ఉపసంహరణ, నగదు డిపాజిట్, నగదు బదిలీ, బ్యాలెన్స్ విచారణ, మిని స్టేట్‌మెంట్ సేవలను ఎస్బీఐ ఖాతాదారులు ఈ డివైజ్ రాకతో ఇంటి నుంచే పొందగలరని ఖారా ఈ సందర్భంగా తెలిపారు. కాగా, ప్రస్తుతం ఎస్బీఐ కస్టమర్ సర్వీస్ పాయిం ట్ల (సీఎస్‌పీ) వద్ద జరుగుతున్న మొత్తం లావాదేవీల్లో 75 శాతం ఈ ఐదు సేవలకు సంబంధించినవే కావడం గమనార్హం.



ఇలా పనిచేస్తుంది..

మొబైల్ హ్యాండ్‌హెల్డ్ డివైజ్‌ను బ్యాంకింగ్ రంగంలో ఓ విప్లవాత్మక మార్పుగా ఎస్బీఐ అభివర్ణిస్తున్నది. ఖాతాదారుల ఇంటి వద్దకే ఇది నేరుగా కియోస్క్ బ్యాంకింగ్ సర్వీస్‌ను తీసుకెళ్తుందని చెప్తున్నది. అంతేగాక కస్టమర్ సర్వీస్ పాయింట్స్ (సీఎస్‌పీ) ఏజెంట్ల పనిని ఈ డివైజ్ ఎంతో సులభతరం కూడా చేయనున్నది. సీఎస్‌పీ ఏజెంట్లు ఈ డివైజ్‌తో ఖాతాదారుల ఇండ్ల వద్దకు వెళ్లి నగదు ఉపసంహరణ, నగదు డిపాజిట్, నగదు బదిలీ తదితర సేవలను అందించనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నది.

మున్ముందు మరిన్ని సేవలు

వీలైనంత త్వరలో ఈ మొబైల్ హ్యాండ్‌హెల్డ్ డివైజ్ ద్వారా కస్టమర్లకు మరిన్ని సేవల్ని అందించాలని ఎస్బీఐ యోచిస్తున్నదిప్పుడు. చేతిలో పట్టుకుని కస్టమర్లు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి వారికి బ్యాంకింగ్ సేవల్ని అందించడానికి అనువుగా ఉండే ఈ డివైజ్ నుంచి భవిష్యత్తులో సామాజిక భద్రత పథకాల్లో ఎన్‌రోల్‌మెంట్, అకౌంట్ ఓపెనింగ్, రెమిటెన్స్, కార్డ్ ఆధారిత సేవలు వచ్చేలా చూడాలనుకుంటున్నది. ఇదే జరిగితే బ్యాంకుల వద్ద రద్దీ చాలా వరకు తగ్గిపోతుందని, బ్యాంకింగ్ సేవలూ అందరికి చేరువవుతాయన్న అభిప్రాయాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

మూడు నెలల్లో 48 వేల కోట్లు

గృహ రుణాలిచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దూసుకుపోతున్నది. దేశవ్యాప్తంగా గృహ రుణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బ్యాంక్ రూ.48 వేల కోట్ల గృహ రుణాలు మంజూరు చేసింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో మంజూరు చేసిన రుణాలతో పోలిస్తే 10.5 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా..తొలి త్రైమాసికం కంటే 14 శాతం అధికమని పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌ను బ్యాంక్‌లో విలీనం చేసుకున్న తర్వాత తొలి త్రైమాసికంలోనే ఇంతటి భారీ స్థాయిలో రుణాలు ఇవ్వడం విశేషం. అలాగే రిటైల్ రుణాల్లో వృద్ధి 85 శాతం నమోదైంది. జూన్ 30, 2023 నాటికి బ్యాంక్ స్థూల అడ్వాన్స్‌లు రూ.1.1 లక్షల కోట్లు పెరిగి రూ.23.5 లక్షల కోట్లకు చేరుకోగా, డిపాజిట్లు రూ.1.1 లక్షల కోట్లు ఎగబాకి రూ.21.7 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి దిశగా సింగరేణి!



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టడంలో ముందువరుసలో నిలిచే సింగరేణి మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుతం నిర్వహిస్తున్న హైడ్రోజన్ ప్లాంట్‌ను గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌గా మార్చడంతోపాటు, రామగుండం రీజియన్‌లో ఒక గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించి నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశించారు. ఇప్పటికే 224 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను పర్యావరణహితంగానిర్వహిస్తున్న సంస్థ... హైడ్రోజన్‌ను కూడా ఉత్పత్తి చేయాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగా 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రంలో వినియోగించేందుకు కావాల్సిన హైడ్రోజన్‌ను ఇకపై సౌర విద్యుత్తును వినియోగిస్తూ ఉత్పత్తి చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రస్తుత ప్లాంట్‌లో తక్షణం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం థర్మల్ విద్యుత్తు కేంద్రంలో 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్ల (1200 మెగావాట్లు) లోని జనరేటర్లలో వేడిమిని తగ్గించేందుకు శీతలీకరణ దాతువుగా హైడ్రోజన్‌ను వినియోగిస్తున్నారు. దీనికోసం ప్లాంట్ ఆవరణలోనే ఒక హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏడాదికి దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్ల హైడ్రోజన్ వాయువును ఈప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తూ.. వినియోగిస్తునానరు. ప్రస్తుతం ఈ ప్లాంట్ 100 కిలోవాట్ల విద్యుత్తును వినియోగిస్తూ హైడ్రోజన్ వాయువును ఉత్పత్తి చేస్తుంది. ప్రస్తుతం సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ప్రాంగణంలోనే.. 10 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్, 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుత్తు ప్లాంట్లు ఉన్నాయి.

సౌర విద్యుత్తుతో రూ. 108 కోట్ల ఆదా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ద్వారా 170 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యింది. దీనితో సింగరేణికి రూ.108 కోట్ల ఆదా అయినట్టు కంపెనీ డైరెక్టర్ వివరించారు.

వడ్డీ రేట్ల పెంపు లేనట్లే!

ఆర్బీఐ కమిటీ సమీక్ష నేపథ్యంలో అంచనాలు • అక్టోబర్ 6న నిర్ణయం వెల్లడి

ముంబై, అక్టోబర్ 4: ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ నేతృత్వంలో మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ద్వైమాసిక ద్రవ్య విధాన పరపతి సమీక్షా సమావేశం బుధవారం ప్రారంభమయ్యింది. మూడు రోజులపాటు చర్చించిన మీదట అక్టోబర్ 6 శుక్రవారం ఉదయం వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ఎంపీసీ వెల్లడిస్తుంది. ఈ దఫా సమీక్షలో కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా అట్టిపెడుతుందని బ్యాంకర్లు, ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ అంశాలు, గరిష్ఠ ద్రవ్యోల్బణం కారణంగా రేట్ల తగ్గింపు ఉండబోదని, అలాగే పెంచే అవకాశం లేదని, రెపో రేటును 6.5 శాతం వద్దే స్థిరంగా ఉంచుతుందని భావిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో 2022 మే నెల నుంచి వరుసగా 250 బేసిస్ పాయింట్ల మేర పెంచిన ఆర్బీఐ ఈ ఏడాది ఫిబ్రవరిలో రెపో రేటును 6.5 శాతానికి చేర్చింది. అప్పటినుంచి మూడు వరుస సమీక్షల్లో రేట్లలో మార్పేదీ చేయలేదు.

రేట్ల కోతకు ఎక్కువకాలం చూడాల్సిందే..

ఈ దఫా పరపతి విధానం, రేట్ల తీరు యథాతథంగా కొనసాగుతాయని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్ మదన్ సబ్నావిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా 6.8 శాతం గరిష్ఠ స్థాయి వద్ద ఉందని, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఇది బాగా తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, పప్పుదినుసుల ఖరీఫ్ దిగుబడి బాగా తగ్గనున్నందున, ధరలు తిరిగి పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ పరిణామాల నడుమ ఎంపీసీ రెపో రేటు తగ్గించడానికి చాలా సమయం వేచిచూడాల్సి వస్తుందని మదన్ అంచనా వేశారు. పాలసీ రేటును ఎంపీసీ యథాతథంగా కొనసాగిస్తుందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ చెప్పారు. గత పాలసీ సమీక్ష తర్వాత పశ్చిమ దేశాల్లో వడ్డీ రేట్లు పెరిగినందున, దేశీయ మార్కెట్ల నుంచి నిధులు తరలివెళ్లడం, ఫారెక్స్ నిల్వలు తరిగిపోవడం, రూపాయి విలువ తగ్గడం వంటి ప్రభావాల కారణంగా ఆర్బీఐ ఆచితూచి వ్యవహరిస్తుందని కార్తీక్ వివరించారు. ఎంపీసీలో ముగ్గురు ఆర్బీఐ అధికారులు, మరో ముగ్గురు కేంద్రం నియమించిన ఆర్బీయేతర సభ్యులు ఉంటారు. శశాంక్ భిడే, అషిమా గోయల్, జయంత్ వర్మలు వెలుపలివారు కాగా, గవర్నర్ దాస్‌తో పాటు ఆర్బీఐ అధికారులు..ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ రంజన్, డిప్యూటీ గవర్నర్ మైఖల్ దేబబ్రత పాత్ర ఎంపీసీ సభ్యులు.

నయనతార 9స్కిన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ప్రముఖ హీరోయిన్ నయనతార తాజాగా చర్మ సౌందర్య ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టింది. ఆమె భర్త విఘ్నేష్ శివన్‌తో కలిసి '9స్కిన్' ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్ డైసీ మోర్గాన్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వెంచర్‌కు ఎంతమేర పెట్టుబడులు పెట్టిన విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇప్పటికే నయనతార-విఘ్నేష్‌లు చాయి వాలాలో పెట్టుబడులు పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్‌తోపాటు సింగపూర్, మలేషియాలో ఈ ప్రీమియం ఉత్పత్తులను విక్రయిస్తున్నది. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ..చర్మానికి ఎలాంటి హానీ కలుగకుండా ఉండే విధంగా 9స్కిన్ ఉత్పత్తులను తయారు చేసినట్లు చెప్పారు. భారత్‌లో స్కిన్‌కేర్ ఉత్పత్తుల మార్కెట్ విలువ 2028 నాటికి 10.31 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా.

కళ తప్పుతున్న ఐపీవోలు

ఈ ఏడాది ప్రథమార్ధంలో నిధుల సమీకరణ రూ.26,300 కోట్లే

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో మెయిన్‌బోర్డ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) ద్వారా ఆయా కంపెనీలు సమీకరించిన నిధులు గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 26 శాతం తగ్గాయి. ప్రైమ్ డాటాబేస్ వెల్లడించిన గణాంకాల ప్రకారం 2022 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 14 ఇష్యూల ద్వారా రూ.35,456 కోట్లు సమకూరగా, ఈ ఏడాది ప్రథమార్థంలో ఇష్యూల సంఖ్య రెట్టింపునకుపైగా పెరిగి 31కు చేరినప్పటికీ, అవి సేకరించిన నిధుల మొత్తం మాత్రం రూ.26,300 కోట్లకు తగ్గింది. అయితే 2022 మే నెలలో వచ్చిన ఎల్ఐసీ ఐపీవోను మినహాయిస్తే ఈ ఏడాది నిధుల సమీకరణ 76 శాతం పెరిగిందని ప్రైమ్ డాటా బేస్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ హాల్దియా తెలిపారు. వివరాలు...

- వివిధ ఈక్విటీ ఇష్యూల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్‌లో జరిగిన నిధుల సమీకరణ 69 శాతం క్షీణించి రూ.73,747 కోట్ల నుంచి రూ.43,694 కోట్లకు పడిపోయింది.
- వీటిలో ఎస్ఎంఈ ఇష్యూ ప్లాట్‌ఫామ్స్, ఇన్విట్స్, రీట్స్, ఓఎఫ్ఎస్, క్విప్ ఇష్యూలు ఉన్నాయి
- ఎస్ఎంఈ ఇష్యూలు సమీకరించిన నిధుల మొత్తం రూ.36,594 కోట్ల నుంచి రూ.29,032 కోట్లకు తగ్గింది
- ఇన్విట్స్, రీట్స్‌తో సహా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించిన నిధులు రూ.15,541 కోట్ల నుంచి రూ.1,446 కోట్లకు తగ్గింది
- క్విప్‌ల ద్వారా సేకరించిన మొత్తం రూ.20,748 కోట్ల నుంచి రూ.5,238 కోట్లకు పడిపోయింది
- ఇన్విట్స్, రీట్స్ సమీకరణ మొత్తం రూ.8,426 కోట్ల నుంచి అత్యంత కనిష్ఠ స్థాయి రూ.416 కోట్లకు తగ్గింది
- డెట్ పబ్లిక్ ఇష్యూల ద్వారా వచ్చిన నిధులు రూ.10,992 కోట్ల నుంచి రూ.3,372 కోట్లకు తగ్గాయి.
- మెయిన్‌బోర్డ్ ఇష్యూల్లో అత్యధికంగా మ్యాన్‌కైండ్ ఫార్మా రూ.4,326 కోట్లు సమీకరించగా, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా రూ.2,800 కోట్లతో ద్వితీయస్థానంలో నిలిచింది. అన్నింటికంటే చిన్న ఐపీవో ప్లాజా వైర్స్ నుంచి వచ్చింది. ఇది రూ.67 కోట్లు మాత్రమే సేకరించింది
- ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఐపీవోలు జారీచేసేందుకు 28 కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే సెబీ అనుమతి పొందిన ఇవి రూ.38,000 కోట్లు సమీకరించాలని ప్రతిపాదించాయి
- మరో రూ.44,000 కోట్ల సమీకరణ కోసం 41 కంపెనీలు సెబీ ఆమోదం కోసం వేచిచూస్తున్నాయి

డీజిల్ ధరలు పెంచిన షెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: షెల్ ఇండియా తమ బంకుల్లో విక్రయించే డీజిల్ ధరను భారీగా పెంచేసింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే లీటర్ డీజిల్ రేటు ఏకంగా రూ.20 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర దాదాపు 90 డాలర్లు పలుకుతున్న నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో లీటర్ డీజిల్ ధరను రోజుకు రూ.4 చొప్పున షెల్ ఇండియా పెంచుతూపోతున్నది. ఈ మేరకు కంపెనీ డీలర్లు, ఇండస్ట్రీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈ క్రమంలోనే షెల్ ఇంధన బంకుల్లో లీటర్ డీజిల్ ధర గరిష్ఠంగా రూ.134కి చేరింది. లీటర్ పెట్రోల్ సైతం రూ.117-118కి అమ్ముతున్నారు. అయితే భారత్‌లో షెల్ కంపెనీకి ఆయిల్ రిఫైనరీలు లేకపోవడమే ఈ స్థాయిలో ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తున్నది. కాగా, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీగా ఉన్న షెల్ ఇండియాకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ బంకులున్నాయి. ఇది లావుంటే ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) బంకుల్లో ఇంధన ధరలు యథాతథమే. హైదరాబాద్‌లో లీటర్ డీజిల్ ధర రూ.97.82గా, పెట్రోల్ ధర రూ.109.66గానే ఉన్నాయి. గత ఏడాదిన్నరగా ధరలు ఇలాగే ఉంటుండగా, ఆయా రాష్ర్టాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యానే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ధరలు స్థిరంగా ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల తర్వాత భారీ వడ్డనలు తప్పవన్న అంచనాలూ బలంగా ఉండటం గమనార్హం. ఇక దేశంలో మొత్తం 87,677 పెట్రోల్ పంపులుండగా, ఇందులో ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు చెందినవే 79,204. మిగతా వాటిలో నయారా ఎనర్జీకి 6,422, రిలయన్స్-బీపీకి 1,633 ఉన్నాయి.

ఎయిర్‌పోర్టు మెట్రో రూట్‌లో రైట్ ఆఫ్ వే

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): విమానాశ్రయ మెట్రో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లోపలి వరకు నిర్మిస్తున్న మెట్రో మార్గంలో భూమిని చదును చేయడం, రైట్ ఆఫ్ వే కోసం ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.6.96 కోట్ల నిధులను వెచ్చించనున్నారు. ఇప్పటికే మెట్రో ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ఎంపిక చివరిదశలో ఉండటంతో ఈ లోపు 31 కిలోమీటర్ల మార్గంలో రైట్ ఆఫ్ వే స్పష్టంగా ఉండేలా క్షేత్ర స్థాయిలో అవసరమైన పనులను అధికారులు వేగవంతం చేశారు.

ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో..

- ఓఆర్ఆర్ వెంబడి హిమాయత్‌సాగర్ వద్ద ప్రేమావతి పేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 374, 384, 385, 388లలో ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి, నిర్ణీత మెట్రో మార్గం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులు చేపట్టనున్నారు.
- బుద్వేల్, హిమాయత్‌సాగర్ ప్రాంతాల్లోని పీఆర్ అండ్ ఆర్‌డీ సంస్థకు చెందిన ఖాళీ స్థలాన్ని చదును చేయడంతో పాటు సమీపంలో ఉన్న 100 చదరపు అడుగుల రోడ్డును అనుసంధానం చేస్తూ ఫెన్సింగ్‌ను వేయనున్నారు.

రీసైక్లిడ్ పెట్ బాటిల్స్‌తో కోక కోలా పానీయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: దేశీయ మార్కెట్లో కోకకోలా తన కార్బొనేటెడ్ బేవరేజెస్ కోసం నూరుశాతం రీసైక్లిడ్ పెట్ బాటిల్స్‌ను ప్రవేశపెట్టింది. 250 ఎంఎల్, 750 ఎంఎల్ ప్యాక్ సైజుల్లో వీటిని మార్కెట్లో విడుదల చేసినట్టు కోక కోలా ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. తమ బాట్లింగ్ భాగస్వాములు మూన్ బేవరేజెస్, ఎస్ఎల్ఎంజీ బేవరేజెస్‌లు ఈ ఆర్ పెట్ బాటిల్స్‌ను తయారు చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. క్యాప్స్, లేబుల్స్ మినహా ఈ బాటిల్స్‌ను నూరుశాతం ఫుడ్‌గ్రేడ్ ఆర్‌పెట్‌తో ఉత్పత్తి చేస్తున్నట్టు పేర్కొంది. ప్యాక్‌పై 'రీసైకిల్ మి ఎగైన్' అనే మెసేజ్‌తో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొంది.

మార్కెట్లకు రెండోరోజూ నష్టాలు

• ఒక దశలో 65 వేల దిగువకు సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 4: దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. విదేశీ నిధులు తరలిపోతుంటడం, అమెరికా, ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం సూచీల నష్టాలకు ప్రధాన కారణం. ఇంట్రాడేలో 633 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 286 పాయింట్లు కోల్పోయి 65,226 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 92.65 పాయింట్లు కోల్పోయి 19,436.10 వద్ద స్థిరపడింది.

టాప్‌లూజర్‌గా యాక్సిస్ బ్యాంక్

మార్కెట్లో యాక్సిస్ బ్యాంక్ షేరు టాప్ లూజర్‌గా నిలిచింది. బ్యాంక్ షేరు ధర 4.38 శాతం తగ్గింది. దీంతోపాటు ఎస్బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, మారుతి, ఎల్అండ్‌టీలు అత్యధికంగా నష్టపోయాయి. కానీ, నెస్లె, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఏషియన్ పెయింట్స్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ, యుటిలిటీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, సేవలు, కమొడిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు నష్టపోగా..ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు మెరిశాయి.

AJIO BUSINESS

దేశీయ అతిపెద్ద ఫ్యాషన్ మేళా

రిటైలర్ల కోసం 10వ ఎడిషన్ ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 4: రాబోయే పండుగ సీజన్‌లో షాపింగ్ చేసే రిటైలర్ల కోసం అజియో బిజినెస్.. భారతీయ అతిపెద్ద ఫ్యాషన్ మేళా (ఐఎల్ఎఫ్ఎం)ను ఆవిష్కరించింది. ఈ 10వ ఎడిషన్‌లో ప్రత్యేకమైన బ్రాండ్లు, 500లకుపైగా కలెక్షన్లు, లక్షకుపైగా సరికొత్త స్టైల్స్ ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తాయని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సంస్థ తెలిపింది. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఈ భారీ ఫ్యాషన్ మేళాను నిర్వహిస్తున్నామన్న అజియో.. రిటైలర్లు తమతమ ప్రాంతాల నుంచే అజియో బిజినెస్ యాప్‌లో షాపింగ్ చేయవచ్చున్నది. ఈ నెల 21దాకా మేళా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా, ఎర్లీ బర్డ్ ఆఫర్లు, డైలీ డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్‌లు, రివైజ్డ్ రిటర్న్-క్రెడిట్ పాలసీలు ఉంటాయి.

యమహా సరికొత్త బైకు

ధర రూ.1,28,900

న్యూఢిల్లీ, అక్టోబర్ 4: మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన ఎఫ్‌జెడ్-ఎస్ ఎఫ్ఐ వీ4ని నూతనంగా తీర్చిదిద్ది మళ్లీ విపణిలోకి ప్రవేశపెట్టింది యమహా మోటర్స్. రెండు కలర్స్‌లో లభించనున్న ఈ బైకు ధర రూ.1,28,900గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ప్రస్తుత పండుగ సీజన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ బైకుతో విక్రయాలు ఊపందుకునే అవకాశం ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 149సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకును బ్లూటూత్‌తో కనెక్ట్ చేసుకునే అవకాశం ఉన్నది.

ఎస్ఐసీసీఐ ప్రెసిడెంట్‌గా అరుణ్ అలగప్పన్

చెన్నై, అక్టోబర్ 4: కోరమండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్..సదరన్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎస్ఐసీసీఐ) ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న అతి పురాతన ఇండస్ట్రీ బాడీ ఇదే కావడం విశేషం. అలాగే వీఎన్ఎస్ లీగల్ ఫౌండర్ వీఎన్ శివ శంకర్..ఎస్ఐసీసీఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ..ఎస్ఐసీసీఐ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు ధన్యవాదములు, వ్యాపార వృద్ధికి తనవంతుగా కృషి చేయనున్నట్టు ప్రకటించారు.

న్యూరో42 బోర్డులోకి కృష్ణ భూపాల్

హైదరాబాద్, అక్టోబర్ 4: మెడికల్ టెక్నాలజీ కంపెనీ న్యూరో42 డైరెక్టర్ల బోర్డులో తన లీడ్ ఇన్వెస్టర్, జీవీకే గ్రూప్‌నకు చెందిన కృష్ణ భూపాల్‌ను నియమించింది. టెక్నాలజీ ఇన్వెస్టర్, బిజినెస్ లీడర్ అయిన కృష్ణ భూపాల్ న్యూరో 42 బృందంలో చేరడంతో ఎప్పటికప్పుడు మారిపోతున్న గ్లోబల్ వాణిజ్య వాతావరణంలో తాము సజావుగా ప్రయాణించడానికి తోడ్పడుతుందని న్యూరో42 వ్యవస్థాపకుడు, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ అభిత్ బత్రా బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జీ, తాజ్‌జీవీకే హాస్పిటాలిటీ, హెల్త్, రియల్ ఎస్టేట్ వంటి కీలక పరిశ్రమల్లో గణనీయమైన షేర్‌హోల్డర్ వాల్యూను పెంచిన ట్రాక్ రికార్డ్ కృష్ణ భూపాల్‌కు ఉందని ప్రకటన పేర్కొంది. డయాగ్నోస్టిక్ ఇమేజింగ్, మెదడుకు సంబంధించిన ఇమేజ్-గైడెడ్ సర్జికల్ ఇంటర్వెన్షన్స్ తదితరాల్లో న్యూరో42 కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.